# హెడ్ కాన్‌స్టేబిల్ వెంకటయ్య ప్రేమ

పోలీస్ స్టేషన్ ముందు రెండు మోటారు సైకిళ్లు వచ్చి నిలబడ్డాయి. ఒకటి ఆ ఊరి బ్రేక్ ఇన్‌స్పెక్టర్ గారి వాహనం. ఖాకీ దుస్తులలో వున్న అతి గంభీరమైన ఆ బ్రేక్ ఇన్‌స్పెక్టర్ గారి శరీరం మండిపోతున్నట్టుంది, అతని ముఖ భావం చూస్తే. అతనితో పాటు కొంగ్రొత్త మోటార్ సైకిల్ మీద వచ్చిన ఆ ఆగంతుకుడు దొరక్క-దొరక్క దొరికినా - అదికూడా దొంగ సొమ్ముతో సహా దొరికిన - తస్కరుడి మాదిరి ముఖం పెట్టుకున్నా కూడ అతని ఇతర లక్షణాలన్నీ, అతను ఒక మాన్యుడనీ ఉద్ఘోషిస్తున్నాయి. మంచి దృఢకాయం, ఎర్రటి రంగు --- అతని ముఖం చూస్తే ఏదో గొప్ప ఇంటిలో పుట్టిన వాడిగా అనిపిస్తున్నాడు. పెద్దగా ఇంగ్లీషు తెలిసినట్టు లేదు. అతను ఒక ధనవంతుడైన తండ్రికి చదువులో వెనుకబడ్డ ముద్దుల కుమారుడు కావచ్చు. అతని దీనమైన ముఖం, బ్రేక్ ఇన్‌స్పెక్టర్ జుగుప్సాభరిత వదనం చూస్తే, ఆ కుర్రవాడు ఒక బీద అమ్మాయిని బలాత్కారం చేస్తూ వుంటే, ఆమె దీన రోదనం విని, ఈ బ్రేక్ ఇన్‌స్పెక్టరు, ఆమెను కాపాడి, ఈ వెధవని లాక్కుని తీసుకువచ్చినట్టు వుంది పాపం. ఆ యువుకుడు అతని కాళ్లు పట్టుకుని యాచిస్తున్నాడు - తనకు డ్రైవింగు లైసెన్సు వుందని, అది ఇంట్లో వుందని, ఈ మోటార్ సైకిల్ తనది కాదని, అది తన మిత్రుడిదని, అందుకే దాని రిజిస్ట్రేషను కాగితాలు అతని ఇంట్లోనే వున్నాయని, ఒక అత్యావసర కార్య నిమిత్తమై కొంచెం దూరం వెళ్లడానికి తొందరపడి బయలుదేరడం వల్ల లైసెన్సులు పట్టుకొనిరాలేదనీ... ఆ బ్రేక్ రాక్షసుడితో మరీ మరీ మొరపెట్టుకుంటున్నాడు. ఆ యువకుడు ఒక రాజద్రోహిగా వున్నట్టు, అతనిపై దయా దాక్షిణ్యాలు చూపిస్తే, అది దేశభద్రతకే ప్రమాదం వాటిల్లేటట్లు, ఆ ట్రాన్స్‌పోర్టు అధికారి భావం, ప్రవర్తన తెలుపుతున్నాయి. ఏమైనా అక్కడి సబ్ ఇన్‌స్పెక్టర్‌ను సంప్రదించి, ఆ మోటార్‌సైకిల్ వారికి అప్పజెప్పి, ఆ నియమాసురుడు నిష్క్రమించాడు. పాపం, ఆ కుర్రవాడు సబ్ ఇన్‌స్పెక్టర్ దగ్గర కూడా ఏడుస్తూ, ఏడుస్తూ తనగోడు నివేదించుకున్నాడు. కాని ఫలితం శూన్యం. ఎందుకంటే, ఆ కేసు సబ్ ఇన్‌స్పెక్టర్ బుక్ చేసింది కాదు గదా! ఇంక ఏమీ చేయలేక, ఎంతో బాధతో ఆ యువకుడు మెల్ల మెల్లగా అక్కడినుంచి బయటకు వెళ్లాడు.

హెడ్ కానిస్టేబుల్ వెంకటయ్య అక్కడ జరిగిన విషాదకరమైన సంఘటనలనన్నింటినీ చూస్తూ నిలబడి వున్నాడు. ఇలాంటివి చాలా చూచి, విని అలవాటు పడిన ఆ నలభై ఏళ్ల హెడ్ కి సానుభూతి అనే ఒక మనో వికారం పుట్టి వుండవచ్చు. కాని, దానికంటే ఎక్కువగా, అతని మనసును పట్టుకున్న వికారం ఏమిటంటే - అది ఒక రకం అత్యాశ అని చెప్పవచ్చు.

ఎన్నోసార్లు, సబ్ ఇన్‌స్పెక్టర్ మోటార్ సైకిల్ వెనక కూర్చుని వెళ్లిన ఆ హెడ్ కానిస్టేబిల్‌కు, ఎప్పుడైనా స్వయంగా మోటార్ సైకిల్ నడుపుతూ వెళ్లాలనే కోరిక

ఉదయించిందంటే, అందులో తప్పుందని ఎందుకు అనుకోవాలి? కాని అతనికుండేది ఒక పాత డొక్కు సైకిలు మాత్రమే. ఒక కాంప్రమైజ్ ఫార్ములా అవలంబిస్తూ ఒక మోపెడ్ కొంటే ఎలా వుంటుందని అతను ఎన్నోసార్లు ఆలోచించాడు. కాని, అతని కుటుంబ ఆర్థిక స్థితి అంతంత మాత్రమే వుండడం మూలానా, అంత డబ్బు పెట్టి కొనాడానికి అతనికి స్తోమత లేదు. అందువల్ల, అతని కోరిక కోరికగానే మిగిలిపోయింది.

కొద్ది సేపు తర్వాత సబ్ ఇన్‌స్పెక్టర్ స్టేషను నుంచి బయటకు వెళ్లిపోయాడు.

స్టేషను ప్రాంగణంలో ఆభరణంగా అలంకృతమైన ఒక నవ వధువులాగా మోటార్ సైకిల్ అతని కళ్లకు మిరుమిట్లు గొలుపుతోంది. దాన్ని చూస్తూ దాని దగ్గరకు వెళ్లకుండా ఉండలేక పోతున్నాడు. అమితమైన అభిలాష కారణంగా, అతని రక్తం సలసల కాగుతూ, మస్తిష్కంలోకి దూసుకుపోతుంది. అతని కాళ్లు, చేతులు నిలువలేక పోతున్నాయి.

''ఒరే సింహాచలం ఇటురా!'' అని తన ఆప్త మిత్రుడైన స్టేషను రైటర్‌ని ఆయన పిలిచాడు. అంతలోపల్నే సబ్ ఇన్‌స్పెక్టర్ టేబుల్ సొరుగులోంచి, అతను ఆ మోటారు సైకిల్ తాలం చెవి కైవసం చేసుకున్నాడు.

వారిద్దరూ, ఆ క్రొత్త మోటర్ సైకిల్‌ను ఇరువైపులా నిలబడి దాన్ని చూస్తూ ఆప్యాయంగా నిమురుతూ ఆనందాన్ని ఆస్వాదిస్తున్నారు. ఆస్వాదనా ప్రాంతానికి రోమాలు వుంటే మాత్రం తప్పకుండా రూమాంచం కలిగేది. ఏమైనాగాని, వీరి చూపులవల్ల స్పర్శవల్ల దానికి ఒక ప్రత్యేక సుఖం కలుగుతూ వుండవచ్చు.

''ఒరే, ఏదైనా ఒక రోజు ఇలాంటిది ఒకటి నేను తప్పక కొంటాను చూస్తుండు'' అని వెంకటయ్య చెప్పాడు.

''అన్నా, 'లోన్' తీసుకొని ఒకటి తొందరగా కొనకూడదా?'' అని సింహాచలం ఒక స్నేహపూర్వకమైన సలహా.

''అవున్రా, అదే చేయబోతున్నాను'' అని చెప్పి వెంకటయ్య మెల్లగా ఆ మోటర్ సైకిల్ పైన కూర్చున్నాడు. హ్యాండిల్ పట్టుకొని, ఫ్రంట్ వీల్‌ని అటు ఇటు తిప్పుతూ, హ్యాండిల్‌కి ఇరువైపులా వున్న అద్దాలలో తన ముఖం చూచుకొని బాగా సంతోషించాడు. తరవాత, తాళం చెవి పెట్టి కాలుతో కిక్ కొట్టి, స్టార్ట్ చేశాడు. అక్సిలేటర్ తిప్పేటపుడు వచ్చిన పెద్ద శబ్దాన్ని విని, అంతకంటే ఎక్కువగా ఆయన పెద్ద అట్టహాసం చేశాడు.

''ఒరే, సింహాచలం, నువ్వు వెనక ఎక్కు. నేను సబ్ ఇన్‌స్పెక్టర్, నువ్వు నా హెడ్ కానిస్టేబుల్'' అని చెప్పేంతలో, అప్పటికే సింహాచలం వెనక ఎక్కి కూర్చు న్నాడు - వెంకటయ్య పొట్టను గట్టిగా పట్టుకొని.

ఆక్సిలేటర్ ఇంకా కొంచెం త్రిప్పుతూ ''ఓరే ఇప్పడెంత స్పీడు వుండొచ్చు'' అని వెంకటయ్య అడిగాడు.

''ఇది బుల్లెట్‌గదా అన్నా. ఒక వంద కిలోమీటర్ల స్పీడులో పోతుండొచ్చు'' అని సింహాచలం మరీ ఉల్లాసంతో, తన సీనియర్‌కు ప్రోత్సాహమిచ్చాడు.

తర్వాత జరగవలసిందంతా ఒక నిమషంలోనే అయిపోయింది. వెంకటయ్య తన కుడి కాలుతో, గేర్ అనే లీవర్‌ని పైకో, క్రిందకో నొక్కడానికి శ్రమించాడు. అతని కాళ్లు చేతులు ఆ చేష్టా ఫలితంగా కానీయండి, లేక వెనుక కూర్చున్న సింహాచలం ఊపువల్ల కానియ్యండి, ఆ మోటర్ సైకిల్ స్టాండు వెనుకకు పోవడం, పెనుగాలి వేగంతో ఆ వాహనం ముందుకు దూసుకొని పోవడం ఒకేసారి జరిగింది. వెంకటయ్యకు ఏదైనా చేయడానికి వీలు దొరికేలోపల స్టేషను పరిసరాలలో వున్న ఒక పెద్ద మఱ్ఱి చెట్టుపైకి ఆ బహువేగ రాక్షస యంత్రం గుద్దుకొని పైకి వెళ్లడం, వెంకటయ్య, సింహాచలం కొంచెం పైకి డైకొట్టి, కాళ్లకు, చేతులకు, తలకాయలకు బాగా దెబ్బలు తగిలేటట్టుగా కింద బడడం జరిగింది. సింహాచలం మాత్రం లేచి నిలబడగలిగాడు. కాని, వెంకటయ్య స్పృహ కోల్పోయిన స్థితిలో వున్నాడు. వెంటనే జనం గుమిగూడడం, ఒక ఆటోరిక్షాలో ఆ హెడ్ కాన్‌స్టేబిల్‌ను హాస్పిటల్‌కు తీసుకువెళ్లడం జరిగింది. సింహాచలానికి గూడా కొద్ది రోజుల ఆసుపత్రి నివాసం తప్పలేదు.

తదుపరి కష్టపడిందంతా, పాపం ఆ మంచి సబ్ ఇన్‌స్పెక్టరే. వెంకటయ్య సబ్ ఇన్‌స్పెక్టర్‌కు చాలా దగ్గర మనిషి కావడంవల్ల అతను రోజూ ఆసుపత్రికి వెళ్లి ఆయనకు ధైర్యం చెప్పి, అతనికి ఎక్కువ ధన నష్టం ఏమీ కలుగకుండా ఏదైనా పునరావాస చర్యలు తీసుకుంటానని ఆయనకు మాట ఇచ్చాడు.

ప్లాస్టర్‌లో వున్న తన కాళ్లు, చేతులను కదిలించకుండా తన కనురెప్పలను కూడా కదిలించకుండా కొంచెం దీర్ఘ సమయంపాటు వీక్షిస్తూ అతను ఒక నిర్ణయానికి వచ్చాడు.

అదేమిటంటే -

''భవిష్యత్తులో ఒక వేళ సబ్ ఇన్‌స్పెక్టర్ అయ్యే మహద్భాగ్యం తనకు కలిగినా కూడా, మోటార్ సైకిల్ అనే ఒక దౌర్భాగ్య వస్తువు తన దగ్గరకు కూడా రానీయను'' అని.